(వనం నాగయ్య-కెరటం న్యూస్):

**మనిషై పుట్టిన వాడు కారాదు మట్టిబొమ్మ..** పట్టుదలే ఉంటే కాగలడు మరోబ్రహ్మ.. కృషి ఉంటే మనుషులు రుషులౌతారు.. మహా పురుషులౌతారు.. తరతరాలకు తరగని వెలుగౌతారు.. ఇలవేలుపులౌతారు.. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శకత్వంలో ఎన్టీఆర్ నటించిన అడవిరాముడు చిత్రానికి వేటూరి గారు ఎన్నటికీ వెలకట్టలేని ఈ పాట రాశారు. మహదేవన్ సంగీతంలో గానగంధర్వుడు ఎస్పీ బాలు ఆలపించిన ఆ పాట కొండ జాతి గుండెల్లో కొండంత స్ఫూర్తిని నింపింది.. మట్టి బొమ్మలను మహా బ్రహ్మలుగా తీర్చిదిద్దిన ఒక అద్భుతమైన ప్రభోదాత్మకమైన గీతమై దశాబ్దాలుగా ప్రతిధ్వనిస్తోంది.. ఇంతకూ ఇప్పుడు ఈ పాటెందుకు అనేగా మీ సందేహం... సరిగ్గా ఈ పాటలోని సాహిత్యానికి రూపం ఇస్తే ఆ రూపమే కాకరపర్తి అప్పారావు. వ్యాపారంలో అపరచాణక్యుడు. ఆదర్శంలో పెద్దన్న, నిత్య కృషీవలుడు, నిగర్వి ఎంత ఉన్నత స్థాయికి చేరినా సమాజానికి ఎంతో కొంత చేయాలన్న పవిత్రమైన ఆశయం కలిగిన ఆదర్శ జీవితం గడుపుతున్న కాకరపర్తి అప్పారావు గుర్తుకు వస్తారు. ఖమ్మం పట్టణంలోని గాంధీ చౌక్ ప్రాంతంలోని పోస్టాఫీస్ పక్కనే ఉన్న కిరాణా దుకాణ సముదాయాలను నిర్వహించిన అప్పారావు విజయ ప్రస్థానం ఇది. కాకరపర్తి రాజలింగం, సావిత్రమ్మ దంపతుల ఏడుగురు సంతానంలో జేష్టకుమారుడైన అప్పారావు వయసు ప్రస్తుతం ఏడు పదులపైనే. ఆయన జీవితం నేటి సమాజానికి చైతన్యం నింపే గీతా సారాంశం. ఆయన పట్టుదల నేటి యువతకు ఆదర్శం. వ్యాపారంలో ఆయన కృషి, క్రమశిక్షణ అన్ని రంగాల్లో పోటీపడుతున్న వారికి కనువిప్పు, ఒక చక్కని దిక్సూచీ.. అందుకే ఇన్ని సుగుణాలున్న కాకరపర్తి అప్పారావు గురించి కెరటం న్యూస్ అందిస్తోన్న ప్రత్యేక కథనం..







# అపరచాణక్యుడు కాకరపర్తి అప్పారావు..

## సెమీ రిటైల్ కిరాణా వ్యాపారాన్ని శిఖరాగ్రానికి చేర్చిన నేర్పరి

- ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి గెలిచిన ధీశాలి..
- చిరుప్రాయంలోనే కుటుంబ బాధ్యతలు పంచుకున్న కృషీవలుడు

### ఇంతకూ ఎవరీ కాకరపర్తి అప్పారావు...?

ఒకప్పుడు మహాత్ముడు, జాతిపిత మహాత్మా గాంధీ నడయాడిన ఖమ్మం నడిబొడ్డున ఉన్న గాంధీ చౌక్‌లో సెమీ రిటైల్ కిరాణం నిర్వహించి ఆత్మవిశ్వాసంతో అంచలంచెలుగా ఎదిగి, సమాజమనే చరిత్ర పుస్తకంలో తన కంటూ కొన్ని పేజీలు రాసుకున్నారు. అప్పారావు తల్లిదండ్రులు రాజలింగం, సావిత్రమ్మ. ఈ దంపతుల ఏడుగురు సంతానంలో అప్పారావు మొదటి సంతానం. ఆయన తరువాత సూర్య నారాయణ, రాజకుమారి, ఉషాకన్య, పద్మావతి, విమల, భాగ్యలక్ష్మి. 1951 డిసెంబర్ 6వ తేదీన సనాతన సాంప్రదాయ హైందవ కుటుంబంలో జన్మించిన అప్పారావు చదువుల తల్లి సరస్వతి కరుణా కటాక్షం మెండుగా ఉండటంతో 1972లోనే ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బీఎస్సీ డిగ్రీ చదివారు. అసలే పెద్దదైన ఉమ్మడి కుటుంబం కావడం చేత కుటుంబ భారాన్ని మోస్తున్న తల్లిదండ్రులను చూసి అప్పారావు తనకెంతో ఇష్టమైన చదువును డిగ్రీ ఫైనల్ ఇయర్ లోనే కుటుంబం కోసం వదిలేశారు. తన తల్లిదండ్రుల కు అండగా పెద్దకుమారు నిగా కుటుంబ బాధ్యతలను తన భుజానికెత్తుకున్నారు.



### ఆత్మవిశ్వాసం అప్పారావుకు పెట్టని అభరణం..

'ఓర్పు గలవానికి దైవికమైన, భౌతికమైన ఆటంకాలు రావు..' అని బ్రిటీష్ ఇంజనీర్ సర్ ఆర్థర్ కాటన్ ఏనాడో చెప్పినట్టుగా తొలుత తన తండ్రివద్ద రూ.6వేలు తీసుకుని గాంధీ చౌక్‌లోని పోస్టాఫీస్‌కు అత్యంత సమీపంలో సెమీ రిటైల్ కిరాణం దుకాణాన్ని నిర్వహించారు. తనను తాను జయించు కోగల మనిషి అన్నింటినీ జయిస్తాడన్న సూక్తిని ఒంట పట్టించుకున్న అప్పారావు తొలుత తన వ్యాపారంపై తన దృష్టంతా కేంద్రీకరించారు. చక్కని ఆలోచన, సరైన ముందు చూపుతో తన వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లేలా చేశారు. పగలూ రాత్రి తేడా లేకుండా తన గుమస్తాలతో కలిసి పనిచేసి కిరాణా వ్యాపారాన్ని అంచలంచెలుగా ఎదిగేలా చేశారు. ఇలా ఒక్కో ఏడాది ఆరోజుల్లోనే రూ.లక్షకు పైగా ఆదాయాన్ని అర్జించేవారు.





ఇలాంటి పరిస్థితుల్లో నిత్యం తన వద్దకు వచ్చే కష్టపర్లకు ఎంతో నమ్మకంగా సరుకులు ఇచ్చి, తన ప్రస్థానాన్ని అనేక మందికి పరిచయం చేశాడు. ఫలితంగా దినదిన ప్రవర్ధమానమై వ్యాపారం అద్భుతంగా విరాజిల్లుతూ వచ్చింది. 1972,73,74 సంవత్సరాలలో పొదుపు చేసిన రూ. 3లక్షలతో తొలుత సొంత భవనాన్ని ఆరోజుల్లోనే పిల్లర్లతో అత్యంత పటిష్టంగా నిర్మించారు. ఆ వెంటనే మరో అధునాతన భవనాన్ని నిర్మాణం చేసి తన సోదరునికి కేటాయించారు.

### ఆమె అతని 'సామ్రాజ్యం..'

ఎన్నో గొప్పవిజయాలు సాధించిన వారి వెనుక ఒక మహిళ ఉన్నట్టే అప్పారావు సక్సెస్ వెనుక ఆయన కుటుంబంతో పాటు ఆయన సతీమణి సమ్రాజ్యం కూడా ఉన్నారు. 1972లో కిరాణా వ్యాపారాన్ని ఆరంభించిన అప్పారావు ఆ వెంటనే 1974లో ముదిగొండ మండలం గంధసిరి గ్రామానికి చెందిన మునగాల పుల్లయ్య, తిరుపతమ్మ దంపతుల ముద్దుల కూతురు సామ్రాజ్యంను పరిణయమాడారు. అనంతరం అప్పారావు, సామ్రాజ్యం దంపతులకు నలుగురు (నళినిలక్ష్మి, రాంప్రసాద్, శ్రీనివాసరావు, విద్యాలక్ష్మి) సంతానం. కుటుంబానికి అప్పారావు పెద్దకుమారుడు కావడం చేత తన వ్యాపారాన్ని దినదినాభివృద్ధి చెందేలా నిరంతరం కష్టపడుతూ తన సోదరుడు సూర్యనారాయణడు, మిగిలిన తోబుట్టువులకు బంగారు భవిష్యత్తును కలుగజేసేందుకు అష్టకష్టాలు పడ్డాడు. చక్కని ఆలోచన, సరైన ముందు చూపుతో కష్టాలను, కన్నీళ్లను, బాధలను చిరునవ్వుతో ఎదుర్కొంటూ ఒక్కో మెట్టూ ఎక్కుతూ అందరికన్నా మెరుగైన వ్యాపారం చేశారు. అదృష్టం అన్వేషించే వారినే వరిస్తుందన్న సామెతను నిజం చేస్తూ వ్యాపారంలో అందనంత ఎత్తుకు ఎదిగారు. ఆయన సతీమణి సమ్రాజ్యం తన భర్త, కుటుంబంలోని సభ్యులను చూసుకుంటూ వారి సంతానంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టి పిల్లలను చదివించారు.

### తన లక్ష్యాన్ని తనయుడి ద్వారా సాధించిన ధీశాలి...

చిరుప్రాయం నుండే చదువంటే ఎంతో ఇష్టపడే అప్పారావు ఆ నాడు తన కుటుంబానికి అండగా నిలిచేందుకు గాను చదువుకు స్వస్తి చెప్పిన విషయం విదితమే. కాగా తాను ఉన్నత చదువులు చదవాలన్న ఆశయాన్ని తన చిన్నకుమారుడు శ్రీనివాసరావు ద్వారా సాధించారు. తనలాగే చిన్నప్పటినుండే చదువులో ముందుంటూ వస్తున్న శ్రీనివాసరావును తొలుత పదోతరగతి తరువాత ఇంటర్ మొదటి సంవత్సరం ఖమ్మంలో పూర్తిచేశారు. ఇంటర్ రెండో సంవత్సరం హైదరాబాద్‌లోని సెయింట్ జోసెఫ్ కాలేజీలో పూర్తిచేశారు. అనంతరం అప్పారావు క్లాస్‌మేట్, ఆనాటి డీఎస్పీ అయిన డి.లక్ష్మణరావు ప్రోత్సాహంతో రూ. 2.5లక్షల డొనేషన్ ఉన్న సీటును తక్కువకే మాట్లాడి శ్రీనివాసరావు బీసీఏ చదివించేందుకు మార్గం చూపాడు. అనంతరం శ్రీనివాసరావు 2002 ఫిబ్రవరిలో జర్మనీ దేశం వెళ్లి ఉన్నత చదువులు మరింత మెరుగైన ర్యాంకుతో పూర్తిచేశారు. అనంతరం ఒక ప్రముఖ కంపెనీలో పనిచేస్తూ 2007నుండి అమెరికాలోని డల్లాస్‌లో నివాసం ఉంటున్నారు. ఇక పెద్దకుమారుడు రాంప్రసాద్ ఇంట్లో తన కుటుంబసభ్యులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వ్యాపార రంగంలో రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్పారావు చేపట్టిన కిరాణా వ్యాపారం ఉన్నత స్థాయికి చేరింది. తన వద్ద పనిచేస్తున్న సుమారు 20మంది కుటుంబాలకు ఉపాధి కల్పించి వారిని తన కుటుంబ సభ్యుల్లా కాపాడుకున్నారు. వయసు పైబడటంతో ఇటీవల తన వ్యాపారాన్ని తగ్గించుకున్నారు. ప్రస్తుతం ఖమ్మంలోని ఫైవ్ ఎలిమెంట్స్‌లో తన సతీమణితో కలిసి ఉంటున్నారు.

### అయ్యప్ప స్వామి అంటే ఆయనకు ప్రాణం..

ఒక పక్క వ్యాపారాన్ని పరుగులు పెట్టిస్తూ అప్పటికే పొదుపు చేసిన డబ్బుతో మూడు లారీలు కొనుగోలు చేసి వాటిపై నిత్యం వివిధ ప్రాంతాలకు పంపిస్తూ వ్యాపారాన్ని మరింతగా విస్తరించారు. ఈ క్రమంలోనే అయ్యప్ప స్వామి అంటే ఎంతో ఇష్టపడే తన దైవాన్ని నమ్ముకుని ఆధ్యాత్మికంగా అనేక దేవాలయాలను చుట్టి వచ్చారు. అందులో ప్రధానంగా మానస సరోవరం, అమర్‌నాథ్, నేపాల్, ముక్తినాథ్, బదరీనాథ్, అహ్మదాబాద్, కాశీ, నైని శరణ్యం, అలహాబాద్ త్రివేణి సంగమం, పూరీ, సౌత్ ఇండియాలోని ప్రధాన దేవాలయాలను సందర్శించి తన భక్తిని పెంపొందించుకున్నారు. అయ్యప్ప భక్తునిగా పేరున్న అప్పారావు 1981 నుండి 1994 వరకూ మొత్తం 14సార్లు మాలధారణ గావించారు. ఒక మారు వన యాత్ర (శబరిమలైలో) కూడా చేపట్టారు.

### ఖమ్మం శ్రీనివాసనగర్ అయ్యప్ప ఆలయ నిర్మాణంలో అప్పారావు పాత్ర..

ప్రస్తుతం ఖమ్మం నగరంలోని శ్రీనివాస నగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయం నిర్మాణంలో ప్రధాన పాత్రదారుల్లో అప్పారావుకూడా ఒకరు కావడం గమనార్హం. దేవాలయంతో పాటు ఎస్‌వీఎం స్కూలు నిర్మాణం, కల్యాణ మండపం నిర్మాణంలోనూ అప్పారావు తనదైన ముద్ర వేశారు. పెద్దన్నగా ఉంటూ మిగిలిన వారిని కలుపుకుంటూ ఆలయాభివృద్ధికి కృషిచేశారు. ఈ క్రమంలోనే కాకరపర్తి అప్పారావు తనలోని దాణగుణాన్ని చాటుకున్నారు. ఇటీవల కొణిజర్ల మండలానికి చెందిన ఒక మహిళకు రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లూ కోల్పోవడంతో ఆమె కుటుంబానికి కుట్టుమిషన్ ఇచ్చారు.కోవిడ్‌లో పేదలకు అండగా నిలిచి, డబ్బు, వస్తువుల దానం చేశారు. గిరిజన బాలికకు గుండె ఆపరేషన్ చేయాల్సి వచ్చినప్పుడు కూడా ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. గాంధీచౌక్ సాయిబాబా ఆలయానికి కుట్టు మిషన్, వీల్ చైర్‌ను అందజేశారు.

